రాణా నిర్మాణమెప్పుడో..?

- ఏళ్లుగా పాత గ్రామపంచాయితీ భవనంలో కొనసాగింపు
- శిథిలావస్థకు చేరిన తాత్కాలిక భవనం
- భయం భయంగా విధుల్లో పోలీసులు

వీర్నపల్లి: శాంతి భద్రతలతోపాటు విపత్తులను ఎలా ఎదుర్కోవాలని ప్రజలను చైతన్యవంతులను చేసే పోలీసు యంత్రాంగానికే విపత్తుల భయం పట్టుకుంది. జిల్లా పునర్విభజన, కొత్త మండలాల ఏర్పాటులో భాగంగా ఏర్పడిన వీర్నపల్లి పోలీసుస్టేషన్ శిథిలావస్థకు చేరింది. ఎప్పుడు కూలుతుందో అనే ఆందోళనతో పోలీసులు భయం భయంగా రోజులు వెల్లదీస్తున్నారు. అలాగే గదులు కొరత, కనీస సౌకర్యాలైన మూత్రశాలలు లేని దుస్థితిలో పోలీసు అధికారులు, సిబ్బంది, ఫిర్యాదుదారులు ఏళ్లకాలంగా అవస్థలు పడుతున్నారు. పోలీస్‌స్టేషన్‌కు స్థలం కేటాయింపు జరిగిన నిధులు లేక నిర్మించడం లేదన్నది సమాచారం. అన్ని విభాగాల మాదిరి తాము సౌకర్యాలు, భవన నిర్మాణం గురించి ప్రస్తావించే పరిస్థితి ఉండదని విధుల్లో ఉన్న ఉద్యోగులు తమలో తామే చర్చించుకుంటున్నారు. అందరినీ రక్షించే పోలీసుల కోసం వెంటనే పోలీస్‌స్టేషన్ నిర్మించేందుకు అధికారులు, చొరవ తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.


పోలీస్‌స్టేషన్ కోసం కేటాయించిన స్థలం

స్థలం ఉన్నా నిధులు లేక..

స్థానిక పోలీసుస్టేషన్ తాత్కాలికంగా పాత గ్రామ పంచాయతీ భవనంలో కొనసాగుతోంది. మండలంలోని వీర్నపల్లి సబ్‌స్టేషన్ దగ్గర దాదాపు రెండు ఎకరాల స్థలాన్ని పోలీసుస్టేషన్ కోసం గ్రామస్తులు కొనుగోలు చేశారు. పోలీసుస్టేషన్ నిర్మాణ పనుల నిమిత్తం సర్వే నం 318 స్థలాన్ని గతంలో జిల్లా పోలీస్ శాఖ ఉన్నతాధికారులు పరిశీలించారు. భవన నిర్మాణానికి అవసరమైన నిధుల మంజూరుకు తమ వంతు కృషి చేస్తామని హామీ ఇచ్చారు. మాట ఇచ్చి ఏళ్లు గడుస్తున్న పోలీసుస్టేషన్ నిర్మాణ పనులు కార్యరూపం దాల్చలేదు.


శిథిలావస్థలో ఉన్న వీర్నపల్లి పోలీసుస్టేషన్

సమస్యల వలయంలో..

ఈ భవనంలో సరిపడా గదులు లేక అరకొర వసతులతో కాలం గడుపుతున్నారు. వర్షం వచ్చిందంటే వరద చుట్టుముడుతుంది. వర్షాకాలంలో చిన్నపాటి వర్షం పడినా భవనం పైకప్పు నుంచి వర్షం నీటి జల్లుకు ముఖ్యమైన ఫైళ్లను కాపాడలేని పరిస్థితి ఉంది. గోడలు తడిచిపోయి ఎక్కడ కరెంటు షాక్ తగులుతుందోనని సిబ్బంది భయభ్రాంతులకు గురవుతున్నారు. భవనం శిథిలావస్థలో ఉండి పెచ్చులూడి, గోడలు సైతం బీటలు వారి భవనం ప్రమాదకరంగా మారింది.

మహిళలకు ఇబ్బందిగా ఉంది



పోలీస్‌స్టేషన్‌కు వచ్చే ఫిర్యాదుదారుల్లో మహిళలు చాలా ఇబ్బంది పడుతున్నారు. మహిళలకు ప్రత్యేక మూత్రశాలలు లేకపోవడంతో చాలా ఇబ్బంది పడుతున్నారు. ఇప్పటికైనా అధికారులు ప్రజా ప్రతినిధులు స్పందించి మహిళలకు ఇబ్బంది కలగకుండా చూడాలి.

– నూనవత్ తార, మహిళ, వీర్నపల్లి

వర్షం వస్తే కష్టమే



భారీ వర్షాలు కురిసినపుడు పోలీస్‌స్టేషన్ మొత్తం నీటితో నిండిపోతుంది. వర్షపు నీటికి గోడలు తడిసి కరెంట్ షాక్ వస్తుంది. వర్షం పడినప్పుడల్లా ఠాణా చుట్టూ నీరు చేరి దుర్వాసన వస్తుంది. నాతోపాటు సిబ్బంది, ఫిర్యాదుదారులు కూడా ఇబ్బంది పడుతున్నారు.

– ప్రశాంత్, కానిస్టేబుల్, వీర్నపల్లి

ఉన్నతాధికారులకు నివేదిస్తాం



ఠాణాలో విధులు నిర్వహిస్తున్న సిబ్బంది ఇబ్బంది పడుతున్న మాట వాస్తవమే. మా సమస్యలను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లాం. నూతన భవన నిర్మాణం పూర్తయ్యేవరకు తాత్కాలికంగా వేరే భవనాన్ని ఏర్పాటు చేస్తే బాగుంటుంది.

– నవత, ఎస్సై, వీర్నపల్లి

క్లుప్తంగా

కంటి వెలుగును సద్వినియోగం చేసుకోవాలి


శిబిరాన్ని ప్రారంభిస్తున్న ఆగయ్య

ఎల్లారెడ్డిపేట: అంధత్వాన్ని పారద్రోలడానికి ప్రభుత్వం గ్రామాల్లో ఏర్పాటు చేస్తున్న కంటి వెలుగు శిబిరాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షులు తోట ఆగయ్య, ఎంపీపీ పిల్లి రేణుక అన్నారు. ఎల్లారెడ్డిపేట మండలం అల్మాస్‌పూర్‌లో శుక్రవారం కంటి వెలుగు శిబిరాన్ని వారు ప్రారంభించి మాట్లాడారు. ప్రభుత్వం అందరికీ ఆరోగ్యాన్ని అందించాలనే లక్ష్యంతో వైద్య రంగంపై దృష్టి సారించిందన్నారు. ప్రతి పేదవాడికి ఖరీదైన వైద్యం అందిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ చీటీ లక్ష్మణ్‌రావు, సెస్ డైరెక్టర్ కృష్ణహరి, సింగిల్‌విండో చైర్మన్ కృష్ణారెడ్డి, కార్యదర్శి ప్రవీణ్, గ్రామస్తులు పాల్గొన్నారు.

సిరిసిల్లలో..

సిరిసిల్లటౌన్: సిరిసిల్ల పట్టణంలోని 17వ వార్డులో శుక్రవారం కంటి వెలుగు శిబిరాన్ని మున్సిపల్ కమిషనర్ వెల్దండి సమ్మయ్య, కౌన్సిలర్ గుండ్లపెల్లి నీరజ శుక్రవారం ప్రారంభించారు. కార్యక్రమంలో మాజీ కౌన్సిలర్ పూర్ణచందర్, కంటి వైద్యులు పాల్గొన్నారు.

క్షీరాభిషేకం


గీత కార్మికుల సంబరాలు

చందుర్తి: సీఎం కేసీఆర్ కల్లు గీత కార్మికుల కోసం బీమా పథకం అమలు చేయడాన్ని హర్షిస్తూ చందుర్తిలో సీఎం కేసీఆర్, వేములవాడ ఎమ్మెల్యే రమేశ్‌బాబు చిత్రపటాలకు శుక్రవారం గీత కార్మికులు క్షీరాభిషేకం చేశారు. అనంతరం బస్టాండ్‌లో ప్రయాణికులకు స్వీట్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఎంపీపీ బైరగోని లావణ్య సంబరాలు జరుపుకున్నారు. నాయకులు బైరగోని రమేశ్‌గౌడ్, మల్యాల సర్పంచ్ గట్ల లక్ష్మీనారాయణగౌడ్, ఏఎంసీ డైరెక్టర్ కత్తి శ్రీనివాస్‌గౌడ్ పాల్గొన్నారు.

చెత్త బుట్టలు పంపిణీ


చెత్త బుట్టలు పంపిణీ చేస్తున్న కౌన్సిలర్

వేములవాడ: వీధులు శుభ్రంగా ఉంచేందుకు ప్రతి ఒక్కరూ తడి-పొడి చెత్తలను వేరు చేసి ఇవ్వాలని పట్టణంలోని 24వ వార్డులో కౌన్సిలర్ అన్నారం ఉమారాణి, నాయకులు శ్రీనివాస్, మున్సిపల్ సిబ్బంది శుక్రవారం ఇంటింటికి చెత్త బుట్టలను పంపిణీ చేశారు.

వర్షంలో తడుస్తూ..


తంగళ్లపల్లిలో వర్షంలో తడుస్తూ నిరసన

తంగళ్లపల్లి/చందుర్తి/బోయినపల్లి: జేపీఎస్, ఓపీఎస్‌లు చేపట్టిన శాంతియుత నిరవధిక సమ్మె శుక్రవారంతో 8వ రోజుకు చేరుకుంది. శుక్రవారం తంగళ్లపల్లిలో వర్షం కురుస్తున్నా లెక్కచేయకుండా ప్లకార్డులు ప్రదర్శిస్తూ నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా జేపీఎస్‌లు మల్లికార్జున్, జనార్ధన్, వాణి, మమత రెడ్డి మాట్లాడారు. కార్యక్రమంలో ఇల్లంతకుంట, ముస్తాబాద్, తంగళ్లపల్లి మండలాల జేపీఎస్, ఓపీఎస్‌లు పాల్గొన్నారు. సమ్మె శిబిరాన్ని వైఎస్సార్‌టీపీ రాజన్న సిరిసిల్ల జిల్లా అధ్యక్షుడు చొక్కాల రాము, మండల అధ్యక్షుడు పూర్మాని కరుణాకర్ రెడ్డి, టౌన్ ప్రెసిడెంట్ మ్యాన లక్ష్మణ్, ఎస్సీ సెల్ గజ్జెల దేవరాజు సందర్శించి వారికి మద్దతు ప్రకటించారు. చందుర్తి శిబిరాన్ని సందర్శించిన మాల మహానాడు సంఘం మండల అధ్యక్షుడు నీరటి శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శి గంధం ప్రదీప్ సమ్మెకు సంఘీభావం ప్రకటించారు.


మద్దతు తెలుపుతున్న వైఎస్సార్‌టీపీ నాయకులు


సమ్మెలో పాల్గొన్న మాల మహానాడు నాయకులు


బోయినపల్లిలో పంచాయతీ కార్మికుల సమ్మె

బజరంగ్‌దళ్ నిరసన ప్రదర్శనలు


దిష్టిబొమ్మ దహనం చేస్తున్న కార్యకర్తలు


వేములవాడలో నల్లమాస్కులు ధరించి నిరసన

- సిరిసిల్లలో కాంగ్రెస్ దిష్టిబొమ్మ దహనం
- వేములవాడలో మాస్కులు ధరించి నిరసన

సిరిసిల్లఅర్బన్: కర్ణాటకలో జరుగుతున్న ఎన్నికల నేపథ్యంలో బజరంగ్‌దళ్‌ను నిషేధిస్తామని కాంగ్రెస్ ఎన్నికల మేనిఫెస్టోలో ప్రవేశపెట్టడాన్ని నిరసిస్తూ సిరిసిల్ల పట్టణ విశ్వహిందు పరిషత్, బజరంగ్‌దళ్ ఆధ్వర్యంలో శుక్రవారం స్థానిక అంబేద్కర్ విగ్రహం ఎదుట కాంగ్రెస్ దిష్టిబొమ్మను దహనం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ బజరంగ్‌దళ్ రాజకీయ పార్టీ కాదని, హిందూ మత రక్షణ కోసం ఏర్పడిన సంస్థ అని పేర్కొన్నారు. ఒక వర్గానికి చెందిన ఓట్ల కోసమే కాంగ్రెస్ ఇలాంటి నీచమైన చర్యకు పాల్పడుతోందన్నారు. విశ్వహిందూ పరిషత్ జిల్లా అధ్యక్షుడు చేపూరి అశోక్, భజరంగ్‌దళ్ కార్యకర్తలు బుర్ర లింగమూర్తి, బండారి సంతోష్, కొమిరే గౌతమ్, రాయిని హరికృష్ణ, బుర్ర హరీష్, విక్కి, వాల్మీకి, క్రాంతి పాల్గొన్నారు.

వేములవాడ: కర్ణాటక ఎన్నికల్లో బజరంగ్‌దళ్‌ను నిషేధిస్తామని ప్రకటించడాన్ని నిరసిస్తూ స్థానిక బజరంగ్‌దళ్ నాయకులు ముఖానికి నల్లమాస్కులు ధరించి పట్టణంలోని అంబేద్కర్ చౌరస్తా, నటరాజ్ విగ్రహాల వద్ద శుక్రవారం నిరసన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో సరిపల్లి రాకేశ్, బుర్ర తేజగౌడ్, మంత సందీప్, దేవరకొండ వంశి, సన్ని, వంశి, కౌశిక్ పాల్గొన్నారు.

ధాన్యం తూకం ప్రారంభం

ముస్తాబాద్: ముస్తాబాద్ మండలం తుర్కపల్లిలో ధాన్యం తరలింపుపై మిల్లర్లతో చర్చించి ధాన్యం తూకం వేయించడం జరిగిందని సర్పంచ్ కాశోల్ల పద్మ తెలిపారు. ఇటీవల కురుస్తున్న వానలతో మిల్లర్లు ధాన్యం దించుకోవడం లేదని, ప్రజాప్రతినిధుల చొరవతో వారితో మాట్లాడి ధాన్యం తరలించేలా సహకరించాల్సిందిగా విజ్ఞప్తి చేయడం జరిగిందన్నారు. రైతులెవరు ఆందోళన చెందాల్సిన అవసరం లేదన్నారు. హమాలీలు, లారీల యజమానులు సహకరించాలని కోరారు. నాయకులు దుర్గప్రసాద్, నర్సయ్య, రైతులు ఉన్నారు.


ధాన్యం తూకం వేయిస్తున్న నాయకులు

బుద్ధుని ఆశయాలు కొనసాగించాలి

ఇల్లంతకుంట: బుద్ధుని ఆశయాలను ప్రతి ఒక్కరు కొనసాగించాలని ఎస్సీ, ఎస్టీ మానిటరింగ్ కమిటీ సభ్యుడు పసుల బాలరాజు అన్నారు. బుద్ధ జయంతి సందర్భంగా మండలంలోని పెద్దలింగాపూర్ గ్రామంలోని బుద్ధ విగ్రహానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. ప్రజలందరూ బుద్ధుడు బోధించిన శాంతి, అహింసామార్గంలో పయణిస్తూ ఇతరులను ప్రేమిస్తూ సమాజాన్ని గౌరవిస్తూ బుద్ధుని బాటలో నడవాలన్నారు.

కస్తూర్బా పాఠశాల ప్రహరీ నిర్మాణానికి నిధులు

వీర్నపల్లి: మండల కేంద్రంలోని కస్తూర్బా పాఠశాలకు ప్రహరీ నిర్మాణానికి సీఎస్ఆర్ నిధుల కింద రూ.20లక్షలు మంజూరైనట్లు సెస్ డైరెక్టర్ మల్లేశం తెలిపారు. శుక్రవారం స్థల పరిశీలనలో పాఠశాల ఎస్ఓ నీలిమ, ఎంపీటీసీ మల్లారపు అరుణ్‌కుమార్, ఆల్ ఇండియా బంజారా సేవాలాల్ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గుగులోత్ సురేశ్‌నాయక్, ఉపసర్పంచ్ బోయిని రవి, తిరుపతి, మహిపాల్, నవీన్, దేవయ్య పాల్గొన్నారు.

రుణమాఫీ చేయాలి

ఇల్లంతకుంట: ఎన్నికల సమయంలో సీఎం కేసీఆర్ ఇచ్చిన మాట ప్రకారం రైతు రుణమాఫీ చేయాలని వైఎస్సార్‌టీపీ మండల అధ్యక్షుడు గజ్జెల దేవరాజు ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. రూ.లక్ష వరకు రుణమాఫీ చేయాలని అన్నారు. దీంతో పాటు తడిసిన ధాన్యాన్ని ప్రభుత్వం కొనుగోలు చేయాలని డిమాండ్ చేశారు.

కల్యాణలక్ష్మి చెక్కులు పంపిణీ

ఎల్లారెడ్డిపేట: ఎల్లారెడ్డిపేటలో లబ్ధిదారులకు మంజూరైన చెక్కులను బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు తోట ఆగయ్య శుక్రవారం పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఎంపీపీ పిల్లి రేణుక,జడ్పీటీసీ చీటీ లక్ష్మణ్‌రావు, సర్పంచ్ నేవూరి వెంకట్ రెడ్డి, ఎంపీటీసీలు నాగరాణి, అనసూయ, సెస్ డైరెక్టర్ కృష్ణహరి, పాల్గొన్నారు.

సీఎంఆర్ఎఫ్ చెక్కులు

ఎల్లారెడ్డిపేట మండలం బుగ్గరాజేశ్వర తండాలో లబ్దిదారులకు మంజూరైన సీఎంఆర్ఎఫ్ చెక్కులను సర్పంచ్ ఆజ్మీరా రజిత పంపిణీ చేశారు. కార్యక్రమంలో నాయకులు రవి, తిరుపతి నాయక్, రమేశ్, బాల్‌సింగ్ పాల్గొన్నారు.

గంగపుత్ర సంఘం కమ్యూనిటీ భవనానికి నిధులు

ముస్తాబాద్: మండలం గూడెం గంగపుత్ర సంఘం కమ్యూనిటీ భవన నిర్మాణానికి మంత్రి కేటీఆర్ రూ.5 లక్షలు మంజూరు చేసినట్లు ఎంపీటీసీ బొప్ప శ్రీధర్ తెలిపారు. మంజూరు పత్రాన్ని శుక్రవారం గంగపుత్ర సంఘం నాయకులకు అందజేశామన్నారు. కార్యక్రమంలో ఉపసర్పంచ్ శాడ శ్రీనివాస్, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు సురేందర్ రావు, గ్రామశాఖ అధ్యక్షుడు పొట్లపల్లి కిషన్, నాయకుల పాల్గొన్నారు.

సమాచారం

9న మైనార్టీ కార్పొరేషన్ లబ్ధిదారుల ఎంపిక

వేములవాడ: ఈనెల 9న వేములవాడ మున్సిపాలిటీ కార్యాలయంలో మైనార్టీ కార్పొరేషన్ లబ్ధిదారుల ఎంపిక ప్రక్రియ చేపడుతున్నట్లు కమిషనర్ అన్వేశ్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. మైనార్టీ రుణాల కోసం ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులు ఆన్‌లైన్ దరఖాస్తుతోపాటు ఆధార్ కార్డు, కుల, ఆదాయ ధ్రువీకరణ పత్రం, రేషన్‌కార్డు జిరాక్స్ రెండు సెట్లతో ఇంటర్వ్యూకు హాజరు కావాలని పేర్కొన్నారు.

9న మండల సర్వసభ్య సమావేశం

వీర్నపల్లి: మండల సర్వసభ్య సమావేశాన్ని ఎంపీపీ మాలోత్ భూల అధ్యక్షతన ఈనెల 9న మంగళవారం మండల పరిషత్ కార్యాలయంలో ఏర్పాటు చేసినట్లు ఇన్‌చార్జి ఎంపీడీవో బంగారం నరేశ్‌కుమార్ తెలిపారు. ఉదయం 11 గంటలకు ప్రారంభ మయ్యే సమావేశానికి ప్రజాప్రతినిధులు, అధికారులు సకాలంలో హాజరు కావాలని కోరారు. సమావేశంలో అభివృద్ధి పనులు, సమస్యలపై శాఖల వారీగా చర్చించడం జరుగుతుందని తెలిపారు.

గ్రామ పంచాయతీలకు ఇన్‌చార్జ్‌ల నియామకం

ముస్తాబాద్: జూనియర్ పంచాయతీ కార్యదర్శుల సమ్మె నేపథ్యంలో వారి స్థానాల్లో 22 గ్రామాలకు ఇన్‌చార్జిలను నియమించినట్లు ఎంపీడీవో రమాదేవి తెలిపారు. బిల్ కలెక్టర్ నరేశ్‌కు మద్దికుంట, మోహినికుంట ఇన్‌చార్జిగా బాధ్యతలు అప్పగించామన్నారు. కొండాపూర్ కార్యదర్శి రాజేశ్వర్ రావుకు రామలక్ష్మణపల్లె, తుర్కపల్లి, పోతుగల్ కార్యదర్శి ఆఫర్‌కు ఆవునూర్, ముస్తాబాద్ కార్యదర్శి రాజుకు మొర్రాయిపల్లె, చీకోడు కార్యదర్శి బాలకిషన్‌కు చిప్పలపల్లి, ఎంపీపీ సూపరింటెండెంట్ శ్రీనివాస్‌కు నామాపూర్, సీనియర్ అసిస్టెంట్ సురేశ్‌కు గూడెం, జూనియర్ అసిస్టెంట్ బిక్షపతికి గూడూరు, తెర్లుమద్ది, గన్నెవారిపల్లె ఓపీఎస్ నరేందర్‌రెడ్డికి సేవాలాల్‌తండా, రాంరెడ్డిపల్లె ఓపీఎస్ రాజుకు గోపాల్‌పల్లె, బిల్ కలెక్టర్ జగన్‌కు మొర్రాపూర్, బందనకల్ , జూనియర్ అసిస్టెంట్‌కు వెంకట్రావుపల్లె ఇన్‌చార్జిగా నియమించినట్లు పేర్కొన్నారు.

వీర్నపల్లిలో..

వీర్నపల్లి: మండలంలోని అన్ని గ్రామ పంచాయతీలకు ఇన్‌చార్జి కార్యదర్శులను నియమించినట్లు ఎంపీడీవో బంగారి నరేశ్‌కుమార్ తెలిపారు. మండల పరిషత్ జూనియర్ అసిస్టెంట్ దేవయ్యకు అడవిపదిర, గర్జన్‌పల్లి, లాల్‌సింగ్ తండా, రంగంపేట్ గ్రామాలకు ఇన్‌చార్జిగా, మండల పరిషత్ జూనియర్ అసిస్టెంట్ రామచంద్రంకు బాబాయిచెరువు, బంజేరు, బావుసింగ్ నాయక్ తండా, భూక్య తండా గ్రామాలు, పంచాయితీ కార్యదర్శి తిరుపతికి ఎర్రగడ్డ తండా, కంచర్ల, మద్దిమల్ల, మద్దిమల్ల తండా గ్రామాలు, మండల పరిషత్ జూనియర్ అసిస్టెంట్ జయసుధకు జవహర్‌లాల్ నాయక్ తండా, సీతారామ్ నాయక్ తండా, శాంతినగర్, వన్‌పల్లి గ్రామాలు, మండల పరిషత్ పంచాయితీ అధికారి బంగారి నరేశ్‌కుమార్‌కు వీర్నపల్లి గ్రామానికి ఇన్‌చార్జిగా బాధ్యతలు అప్పగిస్తూ ఉన్నతాధికారులు ఆదేశాలు జారీ చేశారు.

కరెంట్ సమస్యల పరిష్కారానికి కృషి

ముస్తాబాద్: క్షేత్రస్థాయిలో రైతుల కరెంట్ కష్టాలను తెలుసుకుని పరిష్కారం చేసే దిశగా పనిచేస్తున్నామని సెస్ డైరెక్టర్ సందుపట్ల అంజిరెడ్డి అన్నారు. మండలంలోని ఆవునూర్‌లో పంట పొలాల వద్ద కరెంట్ సమస్యలను స్వయంగా శుక్రవారం అడిగి తెలుసుకున్నారు. సర్పంచ్ బద్ది కల్యాణి, జెడ్పీటీసీ నర్సయ్య పాల్గొన్నారు.

కొనుగోలు వేగవంతం చేయాలి


ధాన్యం పరిశీలిస్తున్న తహసీల్దార్

వీర్నపల్లి: మండలం ఎర్రగడ్డ తండా, రంగంపేట గ్రామాల్లో ధాన్యం కొనుగోలు కేంద్రాలను తహసీల్దార్ తాఫజూల్ హుసేన్ తనిఖీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కొనుగోలు వేగవంతం చేయాలని సిబ్బందికి సూచించారు. రైతులు అధైర్య పడవద్దని, ప్రతి ధాన్యం గింజను ప్రభుత్వమే కొనుగోలు చేస్తుందన్నారు.

బ్రహ్మోత్సవం


తంగళ్లపల్లి: మండలం రామన్నపల్లె గ్రామంలో శుక్రవారం శ్రీవేణుగోపాలస్వామి ఆలయంలో స్వామివారి బ్రహ్మోత్సవాలు కనులపండువగా జరిగాయి. ఎంపీపీ మానస, సర్పంచ్ రంగయ్య, మండల సర్పంచుల ఫోరం అధ్యక్షుడు వేణుగోపాలరావు, బీఆర్ఎస్ అధ్యక్షుడు గజభీంకార్ రాజన్న, సింగిల్‌విండో చైర్మన్ బండి దేవదాస్, నాయకులు పాల్గొన్నారు.

కన్యకా పరమేశ్వరీ విగ్రహ ప్రతిష్ఠాపన వేడుకలు


గొల్లపల్లిలో పూజలు చేస్తున్న కొండూరి

ఎల్లారెడ్డిపేట: మండలంలోని రాచర్లగొల్లపల్లిలోని శ్రీవాసవీ కన్యకాపరమేశ్వరీ అమ్మవారి విగ్రహ, యంత్ర, ధ్వజస్తంభ ప్రతిష్ఠాపన వేడుకలు శుక్రవారం ఘనంగా ప్రారంభమయ్యాయి. టెస్కాబ్ చైర్మన్ కొండూరి రవీందర్‌రావు మొక్కులు చెల్లించుకున్నారు. శ్రీ గీతమందిరం నుంచి విగ్రహమూర్తుల ఊరేగింపు నిర్వహించారు. ఉదయం గోపూజ, గణపతి, గంగా, యాగశాల ప్రవేశం, స్వస్తిపుణ్యావచనం, కలశస్థాపన, నవగ్రహ మండలార్చన, జలాధివాసం నిర్వహించారు. 7న విగ్రహ ప్రతిష్ఠాపన నిర్వహించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. కార్యక్రమంలో ఆర్యవైశ్య సంఘం సభ్యులు చేపూరి రాజేశం, అల్లాడి కుమార్, బండ సతీశ్, రంగయ్య, బాల్‌రాజు, వెంకన్న, వేద పండితులు శ్రీ శ్రీధర్‌స్వామి, మహిళలు పాల్గొన్నారు.

వైద్య సిబ్బందికి సత్కారం

ముస్తాబాద్: మండలం తెర్లుమద్దిలో వైద్య సేవలు అందించిన పోత్గల్ పీహెచ్‌సీ సిబ్బందిని పంచాయతీ పాలకవర్గం శుక్రవారం సన్మానించింది. వారం రోజులపాటు తెర్లుమద్దిలో కంటి వెలుగు శిబిరాన్ని నిర్వహించి వైద్య సేవలు అందించిన వారిని సత్కరించుకోవడం జరిగిందని సర్పంచ్ కలకొండ కిషన్‌రావు తెలిపారు. కంటి వెలుగు శిబిరంలో ప్రజలందరికి ఉచిత పరీక్షలు నిర్వహించి, వారికి కంటి అద్దాలు, మందులు అందజేశారన్నారు. ఇంటింటా సర్వే చేసి కంటి పరీక్షలు చేసుకోని వారిని కూడా గుర్తించి వైద్య సేవలు అందించారన్నారు. మాజీ సర్పంచ్ ఈసరి కృష్ణ, సూపర్‌వైజర్లు, కంటి వైద్య నిపుణులు, ఏఎన్ఎమ్‌లు, ఆశ కార్యకర్తలు ఉన్నారు.

ఆలయ వార్షికోత్సవం


మార్కండేయుడిని దర్శించుకుంటున్న భక్తులు

రుద్రంగి: మండల కేంద్రంలోని మార్కండేయ ఆలయ ప్రథమ వార్షికోత్సవం పద్మశాలీ సంఘం సభ్యుల ఆధ్వర్యంలో ఘనంగా జరిగింది. కార్యక్రమంలో భాగంగా శివపార్వతుల కల్యాణాన్ని నిర్వహించారు. భక్తులు భారీగా తరలి వచ్చి స్వామివారిని దర్శించుకున్నారు. ఎంపీపీ గంగం స్వరూపారాణి, జెడ్పీటీసీ గట్ల మీనయ్య, పద్మశాలి సంఘం అధ్యక్షుడు, కార్యవర్గసభ్యులు, తదితరులు పాల్గొన్నారు.

నృసింహుని సన్నిధిలో ఆది శ్రీనివాస్


స్వామివారిని దర్శించుకుంటున్న ఆది శ్రీనివాస్

వేములవాడఅర్బన్: వేములవాడ రాజన్న అనుబంధ ఆలయమైన నాంపల్లి గుట్టపై వెలసిన శ్రీలక్ష్మీనరసింహస్వామిని డీసీసీ అధ్యక్షుడు ఆది శ్రీనివాస్ శుక్రవారం దర్శించుకున్నారు. స్వామివారికి ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో కాంగ్రెస్ మండల అధ్యక్షుడు పిల్లి కనుకయ్య, నాయకులు ఎర్రం ఆగయ్య, ప్రభాకర్‌రెడ్డి, కత్తి కనుకయ్య, తదితరులు పాల్గొన్నారు.